ఆదాయం ఫుల్.. వసతులు నిల్..

- బోనం కాంప్లెక్స్ సామగ్రి సరఫరాకు ముగిసిన టెండర్లు
- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- అవస్థలు పడుతున్న భక్తులు
- విడిది గదుల్లో తిరగని ఫ్యాన్లు.. వెలగని లైట్లు
- ఉక్కపోతతో భక్తులు ఉక్కిరిబిక్కిరి
- జంతువుల కళేబరాలతో గ్రౌండ్‌ఫ్లోర్ కంపు.. కంపు
- పట్టించుకోని ఆలయ అధికారులు


ఎల్లమ్మ ఆలయం పక్కన ఉన్న బోనం కాంప్లెక్స్

అమీర్‌పేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం పక్కన ఉన్న గ్రౌండ్ ప్లస్-2 బోనం కాంప్లెక్స్(భక్తుల విడిది) ద్వారా ఆలయానికి భారీగా ఆదాయం సమకూరుతున్నా, వసతులు కల్పించడంపై ఆలయ అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కాంప్లెక్స్ నిర్మించినప్పుడు గదులకు రంగులు వేశారు. ఇప్పటి వరకు మళ్లీ రంగులు వేయలేదు. 17 సంవత్సరాల క్రితం వేసిన సున్నం, రంగులు మసకబారి వెలవెలబోతున్నాయి. అసలే మండిపోతున్న ఎండలతో అల్లాడుతున్న భక్తులు తాము తీసుకున్న విడిది గదుల్లో తిరగని ఫ్యాన్లు, వెలగని లైట్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు నానా అవస్థలు పడుతున్నారు.

గ్రౌండ్‌ఫ్లోర్‌లో దుర్వాసన

ఎల్లమ్మ అమ్మవారికి బోనం చేసి మొక్కులు చెల్లించేందుకు ఆలయానికి వచ్చే భక్తులు మేకలు, గొర్లు, కోళ్లను తీసుకువచ్చి వీటికి సాక పెట్టగానే జడ్డించిన అనంతరం ఈ కాంపెక్స్‌లోనే కోపిస్తున్నారు. మాంసాన్ని తీసుకుపోయి వండిన అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి భోజనాలు చేస్తారు. అయితే, మూగ జీవాలను కోసిన అనంతరం కొంత భాగం కసరు, మరికొంత రక్తాన్ని పక్కనే ఓపెన్ మురుగునీటి కాల్వలోకి వదులుతుండడంతో దుర్వాసన వస్తోంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో సైడ్ వాల్స్ కట్టుకుని భోజనం చేస్తున్న కొందరు భక్తులు వాంతులు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఆలయ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయం ఇలా..

బోనం కాంప్లెక్స్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో 36 గదులను విభజించి సైడ్ వాల్స్ కట్టి రూ.800కు ఒకటి చొప్పున అద్దెకు ఇస్తుండగా, మొదటి ఫ్లోర్‌లో ఉన్న 22, రెండో ఫ్లోర్‌లో ఉన్న 26 గదులు ఒక్కోదానిని రూ.1,560 తీసుకుని బుక్ చేస్తున్నారు. ఈ 48 గదులు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న 36 గదులు పూర్తిగా నిండిపోతే ఒక్క రోజుకు రూ.1,03,680 ఆదాయం సమకూరుతోంది. ఈ వేసవిలో ఆది, మంగళవారాలతో పాటు ఇతర రోజుల్లో కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. ఇదికాక బోనం కాంప్లెక్స్‌లో భక్తులకు సామగ్రి సరఫరా చేసే టెండర్ ద్వారా కాంట్రాక్టర్ల నుంచి గత సంవత్సరం వరకు యేడాదికి రూ.63 లక్షలను టెండర్ ద్వారా వసూలు చేశారు. ఇంతటి ఆదాయం ఉన్న ఈ ఆలయం కాంప్లెక్స్‌లో వసతులు కల్పించకపోవడం విచారకరమని పలువురు పెదవి విరుస్తున్నారు.

ఆన్‌లైన్ టెండర్‌కు ముందుకు రాని గుత్తేదార్లు..

బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు టెంట్‌హౌస్ సామగ్రి సరఫరా చేసే టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఈ-టెండర్ విధానం ద్వారా ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇప్పటికే ఐదుసార్లు టెండర్లు పిలిచినా నిరాశే మిగిలింది. దీంతో మరోసారి ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా మరోసారి టెండర్లు పిలువాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. ఈ-టెండర్ ద్వారా దేవస్థానానికి భారీ ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. గత సంవత్సరం రూ.63 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. ప్రతీ సంవత్సరం ఆదాయం పెరుగుతూ వస్తోంది.

పది శాతం పెంపుతో వెనక్కి..

ఆలయం వద్ద ఉన్న విడిది కాంప్లెక్స్‌లో భక్తులు అమ్మవారికి బోనం సమర్పించేందుకు వంటలు వండుతారు. ఇందుకు గదులు ఉన్నాయి. వీటిలో వంటలు చేసుకునే వారికి సామగ్రి సరఫరా టెండర్ దక్కించుకున్న వారు వాటిని సరఫరా చేస్తారు. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్ ఏడు సంవత్సరాలుగా టెంట్‌హౌస్ సామగ్రి సరఫరా చేస్తున్నారు. 10 శాతంగా పెంచిన టెండర్‌తో రూ.69.50 లక్షలకు చేరడంతో ఈసారి ఆయన కూడా వేయలేదు. సంవత్సరానికి ఇంత చెల్లించి టెండర్ దక్కించుకుంటే నష్టాన్ని భరించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఎల్లమ్మ ఆలయం బోనం కాంప్లెక్స్ అంటేనే పోటీలు పడి ధరావత్తు చెల్లించి టెండర్లు వేసే కాంట్రాక్టర్లు ఈసారి మాత్రం ముందుకు రావడం లేదు.


అస్తవ్యస్తంగా మురుగునీటి కాల్వ


గ్రౌండ్‌ఫ్లోర్‌లో మూలకు వేసిన వంట సామగ్రి

పది శాతంపై కమిషనర్‌కు లేఖ

ఎల్లమ్మ ఆలయం బోనం కాంప్లెక్స్ టెండర్ గడువు ముగిసింది. ఈ సంవత్సరం 10 శాతం పెంచడం వల్ల ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటికే ఐదుసార్లు పత్రిక ప్రకటనల ద్వారా తెలియజేశాం. ఆన్‌లైన్ టెండర్లను తెరిచినా ఒక్కటి కూడా రావడం లేదు. ఈ విషయమై దేవాదాయ కమిషనర్‌కు లేఖ రాసి టెండర్ ప్రక్రియ పూర్తయ్యేలా ప్రయత్నం చేస్తా.

- కృష్ణ, ఈవో


గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్‌గౌడ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కార్పొరేటర్లు బాబాఫసియుద్దీన్, సీఎన్‌రెడ్డి తదితరులు
● బోరబండ, ఆంధ్రజ్యోతి


కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఖైరతాబాద్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ నాయకులు
● పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి


కిషన్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో అడ్మిన్ ఎస్ఐ ప్రదీప్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేవైఎం నాయకులు
● పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి


కరపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఇందిరానగర్‌లో 'గావ్ చలో- బస్తీ చలో'

బోరబండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్‌లో 'గావ్ చలో-బస్తీ చలో' కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంచారు. బీజేపీ రహ్మత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొలన్ సత్యనారాయణ, రాందారి బాబు, లక్క మహేష్, రవి, శివ, రామకృష్ణ, షేర్ ఆలం, గోపాల్, లావణ్య, శైలజ, అహ్మద్ పాల్గొన్నారు.


భూలక్ష్మి ఆలయంలో జరిగిన పూజల్లో కోట నీలిమ, విశాల్ సుదాం

వైభవంగా శ్రీ భూలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవం

బేగంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రకాశ్‌నగర్‌లో గల శ్రీ రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలోని శ్రీ భూలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ నిర్మాణ దాత విశాల్ సుదాం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాల నిర్వహణ పర్యవేక్షణకు 18 మంది మహిళలతో ప్రత్యేక కమిటీని నియమించడం జరిగిందని విశాల్ సుదాం తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.


ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగిస్తున్న పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

ఫుట్‌పాత్ వ్యాపారాలపై కొరడా

- ఆపరేషన్ రోప్‌లో భాగంగా దుకాణాల తొలగింపు

బంజారాహిల్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించేలా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్ వ్యాపారాలను పోలీసులు తొలగిస్తున్నారు. నగరంలో వాహనాలు సజావుగా రాకపోకలు సాగించేలా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆపరేషన్ రోప్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు గత నెలలో ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ వ్యాపారాల తొలగింపుపై దృష్టి సారించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించినప్పటికీ పరిస్థితి యథావిధిగా మారడంతో పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ స్వయంగా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 మంత్రుల నివాసాల ఎదుట ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. రోడ్ల మీద ఏర్పాటు చేసిన డబ్బాలను ట్రక్కుల్లో వేసి మరో ప్రాంతానికి తరలించారు. రోడ్డు మీద దుకాణాలు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఈనెల పది రోజుల పాటు రెండో దశ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కొంత మంది స్వార్థంతో దుకాణాలు రోడ్డు మీద పెట్టి వ్యాపారం చేస్తుండడంతో దాని పర్యావసానం ట్రాఫిక్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. వాహనాల రాకపోకలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఇక మీదట ఫుట్‌పాత్ ఆక్రమణ కాకుండా ప్రతి నెలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతో పాటు మాట వినని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడేది లేదని స్పష్టం చేశారు.


రహ్మత్‌నగర్ బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు


బోరబండ కల్వరిహిల్స్ చర్చిలో సిలువను మోస్తున్న ఏసుక్రీస్తు

భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం ప్రార్థనలు


భక్తిగీతాలు ఆలపిస్తున్న సండే స్కూల్ విద్యార్థులు


బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 షారోన్‌చర్చిలో జరిగిన ప్రార్థనల్లో టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి

బోరబండ/బంజారాహిల్స్/బేగంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తును శిలువ వేసిన రోజు శుభ శుక్రవారం వేడుకలు ఘనంగా జరిగాయి. రహ్మత్‌నగర్‌లోని బాప్టిస్ట్, ఎస్పీఆర్‌హిల్స్‌లోని పెనయేలు, సీనాయి కొండ, బోరబండ సైట్-2 కాలనీ కలవరిహిల్స్ సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్, బోరబండలోని పలు చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. ఏసుప్రభువు సిలువపై పలికిన ఏడు వాక్యాలను పాస్టర్లు భక్తులకు వివరించారు. ప్రత్యేకంగా ప్రదర్శించిన శిలువ దర్శనం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఏసు క్రీస్తును ఏవిధంగా సిలువ వేశారో కళ్లకు కట్టినట్లు చూపించారు.


సనత్‌నగర్‌లో క్రాస్ ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు


సిలువను ఎక్కడానికి ముందు సహచరులతో కలిసి చివరి భోజనం (లాస్ట్ సప్పర్) చేస్తున్న ఏసుక్రీస్తు

ఈదురు గాలులతో కూడిన వర్షానికి కూలిన చెట్లు

- మూడు గంటలపాటు విద్యుత్ అంతరాయం


చెట్టు కూలి రోడ్డుపై పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం

బేగంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులతో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి బేగంపేటలోని పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోవడంతో పాటు లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వరదనీరు చేరింది. ప్రధానంగా సింధికాలనీలోని పీజీ రోడ్డులో రెండు చెట్లు కూలిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. గగన్‌విహార్‌కాలనీ, పాటిగడ్డ, ఎయిర్‌లైన్స్‌కాలనీ, మోతీలాల్, నెహ్రూనగర్ ప్రాంతాల్లో కూడా పలుచోట్ల చెట్లు విరిగిపడిపోయాయి.


పీజీ రోడ్డులో కూలిన చెట్టు

విద్యుత్ అంతరాయం

వర్షానికి బేగంపేటలోని పలు ప్రాంతాల్లో సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఓల్డ్ కస్టమ్స్ బస్తీ, బ్రాహ్మణవాడి, పాటిగడ్డ, భగవంతాపూర్ బస్తీ, సింధికాలనీలో సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులకు ఫోన్ చేసినా వారు స్పందించడం లేదని పలువురు తెలిపారు.

తరుణి ట్రావెల్స్ యాజమాన్యంపై కేసు నమోదు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తించిన తరుణి ట్రావెల్స్ యాజమాన్యంపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ నుంచి గోవా వెళ్లేందుకు ఈనెల 15న ప్రయాణికుడు మహేష్ తరుణి ట్రావెల్స్ ఏసీ బస్సులో రూ.1,543కు టికెట్ బుక్ చేశాడు. ఎల్బీనగర్‌లో శుక్రవారం సాయంత్రం బయలుదేరి అమీర్‌పేట వరకు వచ్చిన బస్సులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ట్రావెల్స్ యాజమాని ఆసిఫ్‌ను 25 మంది ప్రయాణికులు నిలదీశారు. తమతో ఆసిఫ్ దురుసుగా ప్రవర్తించి, అసభ్య పదజాలంతో దూషించారని ప్రయాణికులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మధురానగర్ పోలీసులు తరుణి ట్రావెల్స్ యజమాన్యంపై జీరో ఎఫ్ఐఆర్ చేసి ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

పారిశుధ్య కార్మికులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

హైదర్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేమని, నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో వారి పాత్ర కీలకమని సత్ సేవా సంస్కృతి ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానందనగర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆయన శుక్రవారం వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, కార్యదర్శి రామ్మోహన్‌రావు, సలహాదారు మహేష్‌గౌడ్, సభ్యులు సాయి, సుహాస్, నరేష్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పెళ్లి అడ్డుకోవద్దని హెచ్చరించిన సోదరులపై దాడి

బంజారాహిల్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెళ్లిని అడ్డుకోవద్దని హెచ్చరించినందుకు సోదరులపై కొందరు కర్రలతో దాడి చేసి గాయపరిచారు. మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్‌లో నివాసముండే నిజాం అలీ హెయిర్ స్టైలిస్ట్‌గా పనిచేస్తున్నాడు. అతడి సోదరుడు ఇస్లాంకు ఓ యువతితో వివాహం నిశ్చయమైంది. కొద్ది రోజుల క్రితం నౌషద్ అనే వ్యక్తి ఇస్లాంకు ఫోన్ చేసి పెళ్లి చేసుకోవద్దంటూ వాదనకు దిగాడు. ఈ విషయంలో ఇస్లాం అల్కాపూర్‌లో నౌషద్‌ను కలిసి పెళ్లికి అడ్డుపడొద్దని హెచ్చరించాడు. ఇదిలా ఉండగా, ఈనెల 17వ తేదీన ఇస్లాం నిజాం ఓయూ కాలనీలో నిలబడి ఉండగా నౌషద్, సబాట్, అఫ్జల్ తదితరులు కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాన్‌షాప్‌లో చోరీ

బంజారాహిల్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మూసి ఉన్న పాన్‌షాప్ తలుపును పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్లు, గుట్కాలు చోరీ చేశారు. శాలిబండకు చెందిన సయ్యద్ ఖలీల్ షేక్‌పేటలో ఎస్ఎస్ పాన్ షాప్ నిర్వహిస్తున్నారు. ఈనెల 17న రోజు మాదిరిగా షాపు మూసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూసేసరికి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపల రూ.6,500 విలువ చేసే గుట్కాలు, సిగరెట్లు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

బంజారాహిల్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కిరాణం దుకాణానికి వెళ్లేందుకు బయటకు వచ్చిన బాలిక అదృశ్యమైంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 బోలానగర్‌లో నివసించే అతిగా బేగంకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె తభసం భాను(16) స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతుంది. బాలిక సరిగా చదవడం లేదని తల్లిదండ్రులు స్కూల్ మానిపించారు. ఈనెల 16న కిరాణం దుకాణానికి వెళ్లొస్తానని బయటకు వెళ్లిన తబసం తిరిగి రాలేదు. దీంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11కేవీ డీఎస్ఎం కాలనీ, ఎన్‌బీటీనగర్ ఫీడర్ల పరిధిలోని డీఎస్ఎంకాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ ప్రధాన రహదారి, సుభాష్ నగర్, టీవీఎస్ షోరూం లైన్, మెథడిస్ట్ చర్చి లైన్, డి-మార్ట్ ఎదురు ప్రాంతం, ఎన్‌బీటీనగర్, వికార్‌నగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏడీఈ తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు 11కేవీ బాపునగర్ ఫీడర్ పరిధిలోని బాపునగర్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ ఇంటి లైన్, ఆంధ్రా బ్యాంక్ లైన్ ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటిగంట వరకు 11కేవీ కామత్ లింగాపూర్ హౌజ్ ఫీడర్ పరిధిలోని కామత్ లింగాపూర్ హౌజ్,ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, వాటర్‌ట్యాంక్ ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 11కేవీ న్యూ శాస్త్రినగర్ ఫీడర్ పరిధిలోని పీఆర్‌నగర్, ఓల్డ్, న్యూ శాస్త్రినగర్, అవంతినగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు 11కేవీ గ్రేహౌండ్స్ ఫీడర్ పరిధిలోని జీఎంఆర్, ఫ్లై ఓవర్ బేకరీ, స్టేటస్ ప్లాజా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.



ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ ఈనెల 21న జరగనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు, బీజేపీ నాయకుడు కనకట్ల హరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారి అనిల్‌కుమార్, గ్రేటర్ కన్వీనర్ జగన్‌యాదవ్‌లు తదితరులు పాల్గొన్నారు. - (బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి)



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఆస్పత్రుల నిర్మాణ పనులు చేపడుతాం

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): త్వరలో అడ్డగుట్ట, లాలాపేట ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణ పనులను ప్రారంభిస్తామని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. ముప్పై పడకల ఆస్పత్రుల నిర్మాణం కోసం తాజాగా అధికారంగా అన్ని అనుమతులను పొందామన్నారు. శుక్రవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్యాశాఖాధికారి డాక్టర్ రాజేంద్రనాథ్, వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధిపనులపై చర్చించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ అడ్డగుట్టలో ప్రసుత్తమున్న ఆస్పత్రి భవనాన్ని కూల్చివేసిన వెంటనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2023 ఆగస్టు 10న వైద్యశాఖ జీవో నంబర్ 450 ద్వారా 13.05కోట్ల రూపాయలు, లాలాపేట ఆసుపత్రికి జీవో 449ద్వారా 13.05 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. ఆసుపత్రుల నిర్మాణానికి టెండర్ ప్రాసెస్ పూర్తయినందున వెంటనే ప్రసుత్త ఆస్పత్రి భవనాలను ఖాళీ చేసిన అనంతరం కూల్చివేసే పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. సీతాఫల్‌మండిలో 12 కోట్లతో చేపడుతున్న 70 పడకల హాస్పిటల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

చల్లంగా చూడు మైసమ్మ తల్లి

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మైసమ్మతల్లి చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ రేపిల్‌గంజ్ రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ దాత మహేందర్ నికుంజ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నగ్మా మాలకమ్మ, పప్పీ మాలకమ్మ, ఆర్తి మాలకమ్మ, గౌరి నాయక్,శృతి నాయక్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బీఆర్‌ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, వెంకటేషన్ రాజు, నాగులు, జయరాజ్, మహేష్ యాదవ్, శ్రీనాథ్, అమర్త తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాలి వినోద్ కుమార్ తదితరులు

అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలి

● దక్షిణాది జేఏసీ చైర్మన్ వినోద్ కుమార్

● నేడు ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా

తార్నాక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులను కల్పించాలని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్, అసైన్డ్ భూముల యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బింగి రాములు కోరుతున్నారు. శనివారం ఇందిరా పార్కు వద్ద చేపట్టిన మహాధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం తార్నాకలోని దక్షిణాది జేఏసీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులను కల్పించాలన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో తెలంగాణ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంపిణీ చేసిన 24.25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు లేకపోవడంతో అన్యాక్రాంతం అయ్యాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని కోరారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో పేదల ఇళ్ల రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

పాన్‌షాప్‌లో చోరీ

బంజారాహిల్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మూసి ఉన్న పాన్‌షాప్ తలుపును పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్లు, గుట్కాలు చోరీ చేశారు. శాలిబండకు చెందిన సయ్యద్ ఖలీల్ షేక్‌పేటలో ఎస్‌ఎస్ పాన్ షాప్ నిర్వహిస్తున్నారు. ఈనెల 17న రోజు మాదిరిగా షాపు మూసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూసేసరికి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపల రూ.6,500 విలువ చేసే గుట్కాలు సిగరెట్లు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

బంజారాహిల్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కిరాణం దుకాణానికి వెళ్లేందుకు బయటకు వచ్చిన బాలిక అదృశ్యమైంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 బోలానగర్‌లో నివసించే అతిగా బేగంకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె తభసం భాను(16) స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతుంది. బాలిక సరిగా చదవడం లేదని తల్లిదండ్రులు స్కూల్ మానిపించారు. ఈనెల 16న కిరాణం దుకాణానికి వెళ్లొస్తానని బయటకు వెళ్లిన తబసం తిరిగి రాలేదు. దీంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● బోయినపల్లి ప్రధాన వీధులు అధ్వానం
● పారని మురుగు.. పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు
● వాహనదారుల రాకపోకలకు తప్పని తిప్పలు





కంటోన్మెంట్.. 6వ వార్డులో చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి

వర్షమొస్తే.. చెరువులే!

బోయినపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):వర్షం వస్తే రహదారులు చెరువును తలపిస్తున్నాయి. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడాల్సిందే.. అందుకు నిలువుటద్దం.. కంటోన్మెంట్ 6వ వార్డు పరిధిలోని సీతారాంపురం, మర్రి రాంరెడ్డి కాలనీ, హర్షవర్ధన్‌కాలనీ రహదారులు.

శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి బోయినపల్లి ప్రాంతంలో భారీగా వర్షం కురిసింది. రోడ్లు చెరువులను తలపించాయి. దీంతో కాలనీ డ్రైనేజీలు పొంగి పొర్లాయి.. ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలో ఓ పార్టీకి చెందిన ఎమ్మెల్యే బంధువులు పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపడుతున్నాడు. చుట్టూ పరిసర ప్రాంతాల డ్రైనేజీలు మూసుకుపోవడంతో పాటు వర్షం నీరు పారుదలకు తోవ లేక రోడ్డుపై వర్షపు నీరు, డ్రైనేజీ నీరు చేరింది. వాహనదారులు అతికష్టం మీద ప్రయాణాలు సాగించారు. ఈ ప్రాంతంలో సుమారు 8 పాఠశాలలు ఉన్నాయి. వర్షం వచ్చిన సమయంలో పాఠశాలను వదిలిపెడితే విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ రహదారిలో నుంచి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఓల్డ్ బోయినపల్లి, హస్మత్‌పేట్, ఆర్‌ఆర్ నగర్‌లతో పాటు పలు ప్రాంతాలకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడం విశేషం.



ఆహ్లాదం ఆమడదూరం

● కంటోన్మెంట్ పార్కు నిర్వహణ అధ్వానం
● అపరిశుభ్రత తాండవం
● మరమ్మతులకు నోచని క్రీడా, వ్యాయామ పరికరాలు
● మౌలిక సదుపాయాలు మృగ్యం
● పట్టించుకోని అధికారులు

నాడు.. పెద్దలకు, పిల్లలకు కంటోన్మెంట్ పార్కు ఆహ్లాదం.. ఆనందం పంచింది. పెద్దల సరదా కబుర్లు... పిల్లల ఆటాపాటలతో ఇక్కడ పండుగ వాతావరణాన్ని తలపించేది. ఆరోగ్యం దృఢంగా ఉండటానికి వ్యాయామ పరికరాలు.. వాకింగ్ ట్రాక్‌లు సైతం అందుబాటులో ఉండేవి.

నేడు.. పార్కులో ఎక్కడ చూసినా అపరిశుభ్రత కనిపిస్తోంది. ఆట పరికరాలు, వ్యాయామ పరికరాలు కొన్ని పాడైపోగా.. మరికొన్ని మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. మౌలిక సదుపాయాల కొరత కూడా వెక్కిరిస్తోంది. మొత్తంగా .. ఉల్లాసం ఉత్సాహం నింపాల్సి ఉండగా.. సమస్యలతో సతమతమవుతోంది. ఇదీ కంటోన్మెంట్ పార్కు దుస్థితి.



నిరుపయోగంగా మారిన ఆట పరికరం



పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం

తిరుమలగిరి ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : బొల్లారంలోని కంటోన్మెంటు పార్కు నాడు పచ్చదనంతో పరిఢవెల్లి.. నేడు దుమ్ము ధూళితో దర్శనం ఇస్తోంది. బొల్లారం పరిసర ప్రాంతాలైన అల్వాల్, మచ్చ బొల్లారం లాంటి అనేకమైన ప్రాంతాలకు చెందిన మహిళలు, చిన్నారులు పార్కుకు చేరుకుని ప్రకృతిని ఆశ్వాదిస్తూ స్వచ్ఛమైన గాలిని పీల్చుకుని వ్యాయామంతో పాటు కుటుంబ సభ్యులతో వాకింగ్ చేస్తూ ఉంటారు. అయితే మౌలిక వసతులు నిర్వహణ సరిగ్గా లేక పౌరులు రోజురోజుకూ తగ్గిపోతున్నారు. పచ్చని చెట్లతో అందంగా కనిపించిన పార్కు ప్రస్తుతం దుమ్ముధూళితో కొట్టుమిట్టాడుతోంది. దీంతో పాటు అధికారుల నిర్లక్ష్యం వల్ల మెరుగైన మౌలిక వసతులు లేక పార్కుకు వచ్చే పౌరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు ఆటలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన క్రీడాపరికరాలు కొన్ని విరిగిపోవడంతో మూలకు పడవేశారు. తమకు వచ్చిన ఆటలను ఆడుకోలేక ఆటలను ఆశ్వాదించలేకపోవడంతో పౌరులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు మూత్రశాలలు సైతం సరిగా లేకపోవడంతో పాటు దుర్గంధం వెదజల్లడంతో ముక్కుపుటలు అదిరేలా కంపుకొడుతుందని పార్కుకు వచ్చిన వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూత్రశాలలకు తలుపులు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు ఆడ, మగ వారికి వాష్‌రూమ్ అనే సూచిక బోర్డు ఏర్పాటు చేయలేదు. మొత్తంగా చెత్తాచెదారంతో పార్కు దర్శనం ఇస్తోంది. దాని నుంచి విషపురుగులు బయటకు వచ్చి చిన్నారులను మహిళలను కాటేసే ప్రమాదం ఉందని పలువురు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు.



చెత్తతో నిండిన టాయిలెట్

లేబర్ సమస్య ఉంది

నిబ్బంది తక్కువగా ఉన్న నేపథ్యంలో సకాలంలో పార్కులోని చెత్త తొలగించలేకపోతున్నాం త్వరలోనే సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తా.

ప్రధాన మాలి జ్ఞానేశ్వర్

టైమింగ్స్ తెలిపే బోర్డు ఏది?



ఒకప్పుడు కంటోన్మెంట్ పార్కు పచ్చదనంతో సందర్శకులతో కలకలలాడుతుండేది. ప్రస్తుతం దుమ్ముధూళితో కొట్టుమిట్టాడుతోంది. దీంతో పాటు సాయంత్రం వేళ పార్కుకు వెళ్లిన పౌరులకు మహిళలకు మౌలిక వసతులు లేక ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. పార్కు సమయాలు తెలిపే సూచిక బోర్డు లేదు.

సుజాత

టాయిలెట్స్‌కు తలుపులు లేవు



కంటోన్మెంటు పార్కులో ఏర్పాటు చేసిన టాయిలెట్స్‌కు తలుపులు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు టాయిలెట్స్‌కు ఆడ, మగ తెలిపే సూచిక బోర్డులు లేక పోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి.

దేవమ్మ

అంజన్‌కుమార్ వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణుల ఆగ్రహం

● ఆయన దిష్టిబొమ్మ దహనం
● బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్



మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ దిష్టిబొమ్మను శుక్రవారం ఉదయం సీతాఫల్‌మండిలో బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రెండుసార్లు పార్లమెంట్ సభ్యులుగా పనిచేసిన అంజన్‌కుమార్ బాధ్యాతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి మతిభ్రమించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సికింద్రాబాద్ నియోజకవర్గంలో తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, కన్వీనర్ కందాడి నాగేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్లహరి, నాయకులు ఆకారం రమేష్, పోచయ్యయాదవ్, అంబాల రాజేశ్వరరావు, వినయ్‌కుమార్ శారదమల్లేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.



కవితకు నియామక పత్రం అందజేస్తున్న సంధ్య

సేవా సమితి రాష్ట్ర అధ్యక్షురాలిగా కవిత

అడ్డగుట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మహిళా సేనా సేవా సమితి సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలిగా హైదరాబాద్ యూసుఫ్‌గూడకు చెందిన కవిత హిరానందిని నియమితులయ్యారు. ఆ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షురాలు పారుపల్లి సంధ్యాలక్ష్మి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. అనంతరం నూతన రాష్ట్ర అధ్యక్షురాలు కవిత మాట్లాడారు. సమితి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సేవా కార్యక్రమాలు ఉచిత వైద్య శిబిరాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి మహిళల హక్కుల కోసం పోరాడుతున్నామన్నారు. అనంతరం సంస్థ జాతీయ అధ్యక్షురాలు పారువల్లి సంధ్యలక్ష్మి మాట్లాడుతూ, మహిళా హక్కుల కోసం సేవా సమితి సంస్థ పనిచేస్తోందని తెలిపారు. తనకు ఈ అధ్యక్ష పదవి అప్పగించిన సంధ్యలక్ష్మికి కవిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పెళ్లి అడ్డుకోవద్దని హెచ్చరించిన సోదరులపై దాడి

● బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెళ్లిని అడ్డుకోవద్దని హెచ్చరించినందుకు సోదరులపై కొందరు కర్రలతో దాడి చేసి గాయపరిచారు. మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్‌లో నివాసముండే నిజాం అలీ హెయిర్ స్టైలిస్ట్‌గా పనిచేస్తున్నాడు. అతడి సోదరుడు ఇస్లాంకు ఓ యువతితో వివాహం నిశ్చయమైంది. కొద్దిరోజుల క్రితం నౌషద్ అనే వ్యక్తి ఇస్లాంకు ఫోన్ చేసి పెళ్లి చేసుకోవద్దంటూ వాదనకు దిగాడు. ఈ విషయంలో ఇస్లాం అల్కాపూర్‌లో నౌషద్‌ను కలిసి పెళ్లికి అడ్డుపడొద్దని హెచ్చరించాడు. ఇదిలా ఉండగా, ఈనెల 17వ తేదీన ఇస్లాం నిజాం ఓయూ కాలనీలో నిలబడి ఉండగా నౌషద్, సబాట్, అఫ్జల్ తదితరులు కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీ భూలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవం

బేగంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రకాశ్‌నగర్‌లో గల శ్రీ రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలోని శ్రీ భూలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ నిర్మాణ దాత విశాల్ సుదాం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాల నిర్వహణ పర్యవేక్షణకు 18 మంది మహిళలతో ప్రత్యేక కమిటీని నియమించామని విశాల్ సుదాం తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

● భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు జరుపుకొన్నారు. సికింద్రాబాద్‌లో ఉన్న చర్చీల్లో నిర్వహించిన ప్రార్థనలలో భక్తులు పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చి, సీఎస్ఐ వెస్లీ చర్చి, సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, గుడ్ న్యూస్ బాప్టిస్ట్ చర్చి, సెవెంత్ డే అడ్వెంటిస్ట్‌లు కిటకిటలాడాయి. సెయింట్ మేరీస్ చర్చి ఆవరణలో ఏసు క్రీస్తు వృత్తాంతాన్ని నాటిక రూపంలో ప్రదర్శించారు.



క్రీస్తు నాటికను ప్రదర్శిస్తూ...